సాక్షి
పల్నాడు
గురువారం, 8, మే, 2025



కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: చెంచుపేట ఆర్‌పీఎం క్లబ్ రోడ్డులో చేపట్టిన ఆక్రమణల తొలగింపు బుధవారం కొన సాగింది. మురుగు కాల్వలపై ఉన్న ఆక్రమణలను అధికారులు పూర్తిగా తొలగించారు.



కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు

దాచేపల్లి: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతిహోమం, శాంతిహోమం నిర్వహించి, లక్ష మల్లెల పూజలు జరిపించారు.



నేడు దేవాలయం ప్రతిష్టా వేడుకలు

శావల్యాపురం: కృష్ణాపురంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం విగ్రహాల జలాభిషేకం జరిగిందని, గురువారం ప్రతిష్టా వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

న్యూస్‌రీల్

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి



సత్తెనపల్లి: దేశంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసి, తెల్లవారిని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, సేవలను కొనియాడారు. జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ, సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణాలు పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ బృందం



తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో ఇటీవల నిర్మించిన పలు సీసీ రోడ్ల నాణ్యతను బుధవారం గుంటూరు నుంచి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ సభ్యులు పరిశీలించారు. యడ్లలింగయ్య కాలనీలో–6, అమరావతి ప్లాట్స్ స్విమ్మింగ్ పూల్ దగ్గర, పూలే కాలనీ, చెంచుపేట రత్నశ్రీ పబ్లిక్ స్కూల్ దగ్గర, గంగానమ్మపేట శివాలయం వద్ద నిర్మించిన పలు రోడ్లను పరిశీలించి, వాటికి నాణ్యత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్ ఆకుల శ్రీనివాసరావు, ఏఈలు సూరిబాబు, సునీల్, జానీ బాషా పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మదిర షానూన్ సత్తా



మంగళగిరి: ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో ఈనెల 6న జరిగిన ఏషియన్ జూనియర్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున పాల్గొన్న పవర్ లిఫ్టర్ మదిర షానూన్ 47 కేజీల విభాగంలో సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. తెనాలికి చెందిన షానూన్ అక్కడే ఉన్న క్విక్ ఫిట్నెస్ ఎరినాలో అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి వద్ద శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన షానూన్‌ను రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలియజేశారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం



మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం భగవత్ ప్రార్థన, ఆచార్య స్తోత్ర పాఠం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఆచార్య ఋత్విగ్వరణం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్వామికి పంచామృత స్నపన, తిరుమంజనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం రామలక్ష్మణస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం హనుమద్వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

అందని సరుకులు

అర్ధాకలి బతుకులు

పస్తులతో చస్తున్నా పట్టని సర్కారు

- అస్తవ్యస్తంగా పౌర సరఫరా వ్యవస్థ
- బియ్యం, పంచదారతో సరి
- మిగిలిన సరుకుల ఊసే ఎత్తని ప్రభుత్వం
- కానుకలకు మంగళం
- ఆకలితో అలమటిస్తున్న పేదలు

కూటమి ప్రభుత్వం పేదలను గాలికొదిలేసింది. ఇప్పటికే పేదలకు ఇవ్వాల్సిన పలు పథకాలను ఆపేసిన సర్కారు చౌక దుకాణాల ద్వారా అందించే సరుకుల్లో కోత విధించి, వారి నోటికాడ కూడు లాగేసేలా వ్యవహరిస్తోంది. నిత్యావసరాలు ఆకాశాన్నంటుతూ.. ఏం కొనీ,తినలేని దుస్థితిలో ఉన్న పేదలను ఆదరించాల్సిన ప్రభుత్వం రేషన్ సరుకులకు మంగళం పాడేసి, మరింత దుర్భర పరిస్థితుల్లోకి నెట్టేస్తోంది. గతంలో ధరలెంత పెరిగినా ప్రభుత్వం ఇచ్చే రేషన్ సరుకులు ఉన్నాయిలే అనే ధీమా ప్రజల్లో కనిపించేది.. నేడు అరకొర సరుకులిస్తూ ప్రభుత్వం చేతులు దులిపేసుకోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నారు.

నరసరావుపేట టౌన్/క్రోసూరు: రాష్ట్రంలో పది నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అధికారంలోకి వచ్చింది దరిమిలా రాజధాని అంటూ హడావుడి మినహా పేద ప్రజల వైపు కన్నెత్తి చూసిందే లేదు.. వారి బాగోగులకు సంబంధించి చేసిందేమీ లేదు. పైపెచ్చు వీటిని ప్రశ్నించేవారిపై అక్రమ కేసుల కత్తిపెట్టి నోరు మూయిస్తోంది. పేద వర్గాల ప్రజలకు ఏం అవసరమో తెలుసుకునే ప్రయత్నం చేయనేలేదు. రేషన్ బియ్యం బండి వస్తే గతంలో పెద్ద సంచి తీసుకుని నిండుగా సరుకులతో ఇంటికి చేరుకునేవారు. ఇప్పుడు కేవలం బియ్యం, పంచదారతో సరిపెట్టడంతో అటు సంచీ.. ఇటు కడుపూ రెండూ నిండడం లేదు. దీని గురించి పట్టించుకోవడానికి ప్రభుత్వ పెద్దలకు మనసు రావడం లేదు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం సక్రమంగా సరుకులు పంపిణీ చేయక పోవడంతో పేదలు ఆర్థిక భారాన్ని మోస్తున్నారు.

పేదలు కనిపించడం లేదా ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌర సరఫరాల వ్యవస్థను పూర్తిగా విస్మరించింది. పది నెలలుగా కొత్త రేషన్ కార్డుల ఊసే ఎత్తలేదు. తాజాగా ఒక రోజు ముందు నుంచి కొత్త రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులు తీసుకుంటామని ప్రకటించింది. ఈ పది నెలల్లో నూతన రేషన్ కార్డులు లేక, కార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పులు చేయడానికి వీలుగాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో వైపు ప్రభుత్వం రేషన్ పంపిణీని గాలికొదిలేసింది. రేషన్ దుకాణాల ద్వారా రాగులు అందిస్తామని చెప్పి.. కేవలం మాటలకే పరిమితం చేసింది. దీంతో పేద వర్గాల ప్రజలు అర్ధాకలితో అలమటిస్తున్నారు.



నరసరావుపేటలో ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ

కానుకలు మాయం

2014లో అధికారం చేపట్టాక సీఎం చంద్రబాబు నాయుడు ఆర్భాటంగా రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక అందించారు. ఇవి నాసిరకంగా ఉన్నాయంటూ అప్పట్లో ప్రజలు మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఇవే కానుకలు ఇస్తానని ఎన్నికల ముందు ప్రకటించారు. అధికారం చేపట్టాక వీటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. కానుకలు సరే.. కనీసం సరుకులన్నా పూర్తిగా ఇవ్వండయ్యా అని ప్రజలు వేడుకుంటున్నారు.

- రేషన్ సరుకులలో కందిపప్పు, రాగులు, జొన్నలు, వంట నూనె తదితర నిత్యావసరాలు పంపిణీ చేయకపోవడంపై జిల్లా పౌరసరఫరాల అధికారి నారదమునిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

జిల్లాలో రేషన్ దుకాణాల సంఖ్య
1289

మొత్తం రేషన్ కార్డులు
6,34,893

ఎండీయూ వాహనాలు
402

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సరుకులు

- నాణ్యమైన బియ్యం
- కందిపప్పు
- పంచదార
- నూనె
- గోధుమలు
- చింతపండు



కూటమి ప్రభుత్వంలో..

- బియ్యం
- పంచదార (కొన్ని ప్రాంతాల్లోనే..)

గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని సరుకులు ఇచ్చేవారు. ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు వచ్చేవి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రేషన్ సరఫరాను ప్రజలకు అత్యంత సులువుగా చేరేలా చర్యలు తీసుకున్నారు. పౌర సరఫరాల వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్నరకం బియ్యం, పంచదార, గోధుమలు, నూనె, కందిపప్పు, చింతపండు తక్కువ ధరకే అందించారు. దీంతో పేద వర్గాల ప్రజలకు మూడు పూటలా నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లేవి. దీంతోపాటు రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు.

ఐదు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు



కార్డుపై కందిపప్పు కూడా ఇవ్వకపోతే ఎలా..? కార్డుపై గతంలో బియ్యం, పంచదార కందిపప్పు, నూనె ఇచ్చేవారు. అది కాస్త బియ్యం, పంచదారతో సరిపెట్టారు. ఐదు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు బయట కొనలేకపోతున్నాం.
– జెర్రిపోతు మేరీలు, దొడ్లేరు

ఎలా బతకాలి?



కందిపప్పు లేకుండా ఇల్లు గడవదు కదా, నెలకు కేవలం ఇచ్చేది ఒక కిలో కందిపప్పు ప్యాకెట్ మాత్రమే. అదీ కూడా ఇవ్వకపోతే ఎలా బతకాలి?
– జల్ది అన్నమేరీ, దొడ్లేరు

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



నరసరావుపేట: ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీసులు బుధవారం సాయంత్రం నుంచి అసాంఘికశక్తుల కార్యకలాపాల నిరోధానికి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాలతో నగరం, పట్టణ శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ప్రజాశాంతికి భంగం కలిగించటం, మద్యం సేవించి వాహనాలు నడపటం లాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన రహదారులపై విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలను కొనుగోలు చేస్తామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి నారదముని చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెంలో రైతుల వద్ద గల ధాన్యం నిల్వలను బుధవారం పరిశీలించారు. సత్తెనపల్లిలో జరిగిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ధాన్యం కొనుగోలు చేయటం లేదని పలువురు రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావటంతో ఆయన ఆదేశాల మేరకు ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి రేపటిలోగా ధాన్యం సేకరిస్తామని చెప్పారు. అనంతరం తేమశాతాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఏఓ ఎం.అరుణ ఉన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు
- చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యేతో కలిసి ఆర్టీసీ డిస్పెన్సరీ ప్రారంభం

నరసరావుపేట: సంస్థ రేటింగ్ పడిపోకుండా ఉద్యోగులు పనిచేయాలని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఆర్టీసీ గ్యారేజ్ స్థలంలో సుమారు రూ.84లక్షల వ్యయంతో నిర్మించిన డిస్పెన్సరీని బుధవారం ప్రారంభించారు. డిస్పెన్సరీ శిలాఫలకాన్ని సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ ఆవిష్కరించగా డిస్పెన్సరీని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ఎండీ తిరుమలరావు రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో తిరుమలరావు మాట్లాడుతూ ఆక్యుపెన్సీ పెంచాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, క్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్యానికి పెద్దపీట వేసి కంప్యూటరైజ్డ్ కంటి పరీక్షలు, హృద్రోగ పరీక్షలు చేపట్టామన్నారు. మచిలీపట్నంలో ఇప్పటికే నూతన డిస్పెన్సరీని ప్రారంభించామన్నారు. ఉద్యోగుల ప్రమోషన్లకు లంచాలు అడుగుతున్నారనే వార్తల నేపథ్యంలో అటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ తనకు ట్రేడ్ యూనియన్లతో అవినాభావ సంబంధం ఉందన్నారు. ఇప్పుడు అన్నీ వ్యవస్థలు భ్రష్టుపట్టి పోగా ఒక్క ఆర్టీసీనే నిజాయతీగా పనిచేస్తుందన్నారు. నేడు వైద్యపరీక్షలు, చికిత్స అత్యంత ఖరీదుగా మారిందాయని, ప్రాథమిక వైద్యం కోసం ఇటువంటి డిస్పెన్సరీలు ఉపయోగపడతాయన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రూ.30కోట్ల వ్యయంతో నూతన డిపో నిర్మాణం చేస్తామన్నారు. డిస్పెన్సరీకి కావాల్సిన ఏసీ సౌకర్యాన్ని తాను కల్పిస్తానని హామీ ఇచ్చారు. నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.మధు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ, ఆర్టీసీ ఉన్నతాధికారులు, స్థానిక యూనియన్ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరించిన ఎండీ తిరుమలరావు, చిత్రంలో చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే చదలవాడ

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- సత్తెనపల్లిలో నియోజకవర్గ సమీక్ష సమావేశం

సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో సత్తెనపల్లి నియోజకవర్గ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రతి శాఖలోనూ లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ లక్ష్యాలను అధిగమించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను సిద్ధం చేసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోర్టుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి త్వరగా కేటాయించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంతో పాటు గ్రామాల్లో విరిగిన, పాడుబడిన విద్యుత్ స్తంభాలను, లోలెవెల్ విద్యుత్ కనెక్షన్లను తక్షణమే సవరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విత్తనాలు, పనిముట్లు, సబ్సిడీపై వచ్చే అన్నిరకాల పరికరాలను రైతులకు అందుబాటులో ఉంచేలా వ్యవసాయ అధికారులు చూసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పక్కన ఎమ్మెల్యే కన్నా, ఎంపీ లావు, జేసీ

'ఉపాధి' లక్ష్యం నెరవేరేలా పనిచేయాలి

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లక్ష్యం నెరవేరేలా అధికారులు పనిచేయాలన్నారు. పేదలకు మంజూరైన పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లక్కరాజు గార్లపాడు రోడ్డులో శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం, సత్తెనపల్లి–అమరావతి మార్గంలోని నందిగామ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించి లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, డీపీఎం అమలకుమారి నేతృత్వంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల గ్రూపునకు ఆర్గానిక్ సర్టిఫికెట్లు, రైతులకు సీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. జేసీ గనోరే సూరజ్, ధనుంజయ్, ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెకానిక్ కిడ్నాప్ కలకలం

- చంద్రాజుపాలెంలో పాడుబడిన ఇంటిలో నిర్బంధించిన దుండగులు
- తప్పించుకొని పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చిన బాధితుడు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆటోనగర్‌లో గ్యారేజ్ నడుపుతున్న మెకానిక్ కిడ్నాప్ కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని రఘురాం నగర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి గుంటూరు రోడ్‌లోని ఆటోనగర్‌లో ఆటో గ్యారేజ్ నడుపుతున్నాడు. ఆయనకు కొంతకాలంగా పట్టణంలోని వడవల్లిలో నివసించే బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన తోకా ప్రకాష్ పరిచయమయ్యాడు. పాత వాహనాలు కొనుగోలు చేసి మరమ్మతులు చేస్తూ విక్రయించటం చేస్తుంటాడు. ఈ క్రమంలో మస్తాన్‌వలికి చెందిన ఓ ఇంటిని ప్రకాష్ కొనుగోలు చేశాడు. దీనిపై నగదుకు సంబంధించి ఇరువురి మధ్య వివాదం నెలకొంది. ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో మస్తాన్‌వలి పట్టణ పోలీసులను ఆశ్రయించగా ఇది సివిల్ వివాదం అని, కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో మస్తాన్‌వలి ఈ నెల 5న కోర్టును ఆశ్రయించాడు. విషయం తెలుసుకున్న ప్రకాష్ తన దగ్గర సరైన కాగితాలు లేకపోవడంతో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో తాను ఆటో గ్యారేజీ మూసివేసి ఇంటికి వెళుతుండగా మరో నలుగురితో కలిసి కారులో వచ్చి తనను అడ్డగించారని, తనను కారులో ఎక్కించుకొని అటూ ఇటూ తిప్పుతూ తనపై దాడి చేశారని మస్తాన్‌వలి తెలిపాడు. కొంతసేపటి తర్వాత తనను చంద్రాజుపాలెం గ్రామానికి తీసుకెళ్లి ఊరు చివరన పాడుబడిన ఇంట్లో చేతులు, కాళ్లు కట్టేసి నిర్బంధించారన్నాడు. కొద్దిసేపటికి తప్పించుకున్న తాను పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చానని, హుటాహుటిన పోలీసులు తనను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారన్నారు. ఇంటి వివాదం నేపథ్యంలో ఇరువురు మధ్య నెలకొన్న మనస్పర్థలు వారి మధ్య కిడ్నాప్, దాడికి కారణమైనట్లు పోలీసులు భావిస్తున్నారు. క్షతగాత్రుడు మస్తానవలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రగాయాలతో మస్తానవలి

నేటి నుంచి శ్రీరంగనాథ కల్యాణోత్సవాలు

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న, కొండవీడు ప్రాంతంలోని ప్రాచీన ఆలయాల్లో ఒకటైన శ్రీభూసమేత రంగనాయకస్వామి ఆలయం కనుమరుగైన చరిత్రకు ప్రత్యక్ష ప్రతిరూపం. కేవలం ఇది ఓ కట్టడమే కాదు, గతకాలపు సంస్కృతిని, నమ్మకాలను, భక్తిశ్రద్ధలను ఆవాహనం చేసుకున్న పవిత్ర కోవెల. ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు దేవస్థానంలో కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి.

'వలస'లే 'సొలస'గా మారి..



అద్భుత అలంకరణలో స్వామివారి మూలవిరాట్

పూర్వం రంగపట్నం ఏర్పడ్డ ప్రదేశానికి పడమర దిశగా అంతా కీకారణ్యంగా ఉన్న ఈ ప్రాంతంలో నాదెండ్లకు చెందిన కొందరు తమ పశువులతో వచ్చారు. వీరిలో వలసయ్య అనే నాయకుడు కొండవాడు నీటిని ఒడిసి పట్టేందుకు రామన్న పేరుతో ఓ చెరువును తవ్వించి, ఈ ప్రాంతానికి జీవనాడిని అందించాడు. కొన్నాళ్లకు అది ఓ గ్రామంగా మారింది. నాడు ఏర్పడిన ఆ గ్రామమే నేటి సొలస. 'వలసయ్య' నామమే కాలక్రమేణ సొలసగా రూపాంతరం చెందినదని కొందరు..' వలస' ప్రాంతం కాబట్టి వాడుక భాషలో 'సొలస'గా మారిందని మరికొందరి వాదన ఇక్కడ వినిపిస్తుంది.



శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానం

అనువంశిక బాధ్యతలు

ఈ దేవాలయానికి ప్రస్తుతం 150 ఎకరాల భూమి ఉంది. యడ్లపాడు, వేమవరం, తూబాడు వంటి ప్రాంతాల్లో స్వామివారి ఆస్తులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆలయం దేవదాయశాఖ పర్యవేక్షణలో ఉంది. ఆలయ తొలి అర్చకులు ఉన్నవ గ్రామస్తుడు పర్చూరి వెంకట రమణాచార్యులు కాగా, అనువంశిక బాధ్యతలు గైకొన్న ప్రస్తుత ఆలయ అర్చకుడు పర్చూరి రామకృష్ణమాచార్యులు ఐదోతరంవాడిగా, అర్చపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు ఆరో తరానికి చెందిన ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

ఏడాదిలో ఒక్క రోజే నిజరూప దర్శనం

గర్భగుడి రెండు వైపులా జయవిజయులు నిలిచి ఆలయానికి ఆభరణంగా ఉంటారు. గర్భగుడిలో శేషతల్పంపై యోగనిద్రలో ఉన్న రంగనాథునికి శ్రీదేవి, భూదేవులు పాదసేవ చేస్తూ కనిపిస్తారు. ఈ క్షేత్ర విశేషాల్లో ముఖ్యంగా ఆంజనేయస్వామి రెండు రూపాలు చూడవచ్చు. ఒకటి స్థానక భంగిమలో నల్లరాతి విగ్రహం, మరొకటి గోడపై వర్ణరంజిత రూపం. ఇక్కడ గణపతి విగ్రహం గుండ్ర ని భూ ఆకృతిలో ఉండటం విశిష్టత. ప్రతీ సంవత్సరం వైశాఖ పౌర్ణమికి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఇందులో కీలకంగా, నాలుగు రోజుల ముందు స్వామివారి అలంకారాలు తొలగించి ఒక్కరోజు భక్తులకు నిజరూప దర్శనం కలిగించడం ఈ ఆలయ వైశిష్ట్యం.

పాఠశాలలు తెరిచేనాటికి పుస్తకాలు పంపిణీ


స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ

సత్తెనపల్లి: పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికీ పుస్తకాల పంపిణీ జరగాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో ఉన్న శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పుస్తకాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి మండలానికి ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 50 వేల పుస్తకాలకు గాను 30 వేల పుస్తకాలు రాగా మరో 20 వేల పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. పుస్తకాలను పరిశీలించిన డీఈఓ, ఎంఈఓ-2 ఎ.రాఘవేంద్ర రావుకు పలు సూచనలు చేశారు.

ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూషణం




అచ్చంపేట: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల పీడీ గుడిపూడి భూషణం ఎంపికయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన చిత్తూరులో ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. గత కొంతకాలంగా తమ పాఠశాలనుంచి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న దృష్ట్యా తనను సభ్యులంతా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. తన శక్తివంచన లేకుండా రెజ్లింగ్ క్రీడకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చేలా కృషిచేస్తానన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కరుణకుమార్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది గుడిపూడి భూషణంను అభినందించారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు



నూజెండ్ల: పిచ్చికుక్క దాడిలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని కమ్మవారిపాలెం యానాది కాలనీలో ఆరుబయట నిద్రిస్తున్న వారిపై పిచ్చికుక్క దాడి చేసింది. కాలనీకి చెందిన మల్లవరపు వెంకటేశ్వర్లు, మల్లవరపు అంకమ్మ, చలంచర్ల అప్పారావులను కుక్క కరిచింది. 108 వాహనంలో వారిని నూజెండ్ల పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుడు అందుబాటులో లేకపోవటంతో అక్కడి వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి వినుకొండ వైద్యశాలకు తరలించారు.

సాక్షి Smart Economic Display Advertisement Feature SED



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ నర్సింగ్(Girls) MLT వెటర్నరి, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలు హాస్టల్ వసతి కలదు. 7386706839, 7780494333

REAL ESTATE

■ అమరావతి మునుగోడు వద్ద ఎర్రచందనం చెట్లు 60 అడుగుల రోడ్డులో వెంచర్ వేసిన దానికి ప్రక్కన 1.10 సెంట్లు 80ల. 9502736614, 9949284105

SERVICES

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

HOME CARE SERVICE

■ లలిత హోం కేర్ సర్వీస్, విజయవాడ. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటిపని / వంట పని / బేబీకేర్ కొరకు M/F వర్కర్లను 24/7 మీ ఇంటికి పంపగలము✆ 97054 91122, 94932 46482

WANTED

■ గుంటూరులోని హాస్పిటల్స్ నందు ఫిమేల్ నర్సింగ్ సూపరింటెండ్ ANM, GNM నర్సింగ్ స్టాఫ్ M/F లేడీ రిసెప్షన్ ఆయాలు యువకులు కావలెను. 7997777108

■ ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ హోమ్ థాలి గుంటూరు నందు ఫుడ్ ప్యాకింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9505012666, 9381982818

■ మాధవి హోటల్స్ నందు షిఫ్టులు వారిగా పని చేయుటకు జెంట్స్ అండ్ లేడీస్ మేనేజర్ మరియు బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ వెంకట్. 9010453888

■ అమరావతి హైకోర్టు వద్ద గల కంపెనీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 17500, 12గం॥ డ్యూటీ. 9848062846, 9493803047

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, బ్లాక్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు: 21 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు ఉండవలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 9154152896

■ Wanted Male Administrative Staff Qualification Any Degree/PG. Age Limit 25 to 45years, Salary Upto: 20,000/- location: Master Minds College, Nellore, Interested Candidates may whatsapp their Resume to the Contact Number. 8978480430

■ వంటమనిషి కావలెను. గుంటూరు పట్టణంలో ఏ.టి. అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్ అన్నిరకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579

■ డ్రైవర్స్ కావలెను. ఆటోమెటిక్ మరియు మాన్యువల్ కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22282

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ నరసరావుపేట, చిలకలూరిపేట, తెనాలి, చీరాల, గుంటూరు Local ఏరియాలలో పని చేయుటకు కావలెను. "Field Executives" (Salary 15K to 22K +Inct) సంప్రదించండి ✆ 92484 86177

■ గుంటూరు నందు పనిచేయుటకు టెలికాలర్స్ (F) ప్రమోటింగ్ టీం (M) కావలెను. Q: Any Degree, English Fluency is Must. అనుభవానికి ప్రాధాన్యత. జీతం: 15k to 20k. Freshers can Also Apply. ✆87499 77799

■ [illegible] 98488 30615

■ [illegible] 8328639434 / 9059314217

■ [illegible] 92980 11777, 81427 61777

■ [illegible] 18K. ఫోన్: 9912011499, 9912011899

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
గుంటూరు 7075167663 7075167541
గమనిక [illegible]

భారీ గాలులు.. వడగండ్ల వాన


గోపాలపురం సమీపంలో రోడ్డుపై పడిపోయిన చెట్లు, విద్యుత్ తీగలు


బున్నీనగర్ సమీపంలో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలు


స్తంభంపై నుంచి తీగలు పూర్తిగా తొలగిన దృశ్యం


చెంఘీజ్‌ఖాన్ పేట సమీపంలో రోడ్డుపై కూలిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం

విద్యుత్ స్తంభాలు నేలకూలి పలు గ్రామాల్లో అంధకారం

యడ్లపాడు: మండలం పరిధిలో బుధవారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దాదాపు గంట సేపు వీచిన భారీ గాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఉరుములు, మెరుపులతో వడగండ్ల వర్షం కురిసింది. దీంతో ఈదురు గాలులకు భారీ చెట్లు, కొమ్మలు విరిగి పడ్డాయి. బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట మార్గంలో రహదారిపై భారీ చెట్లు పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస కోళ్ల ఫారాల వద్ద స్తంభాలపై, తీగలపై చెట్ల కొమ్మలు, ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. మామిడి, బొప్పాయి తోటల్లో కాయలు రాలిపోయాయి. మునగచెట్లు విరిగిపోయాయి. చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని వెన్నముద్దల బాలకృష్ణుని ఆలయం వెనుక ఉన్న రెండు పూరిళ్లపై చెట్ల కొమ్మలు పడి కప్పులు ధ్వంసం అయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో సరఫరా నిలిచి పోయి పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ అధికారులు బృందాలుగా ఏర్పడి రోడ్లపై, విద్యుత్ తీగలపై పడిన చెట్లను, కొమ్మల్ని తొలగించే చర్యలు చేపట్టారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. మైదవోలు, చెంఘీజ్‌ఖాన్‌పేట మార్గం గుండా కొండవీడు సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అందించే 11కేవీ విద్యుత్ స్తంభాలు నాలుగు నేలకొరిగాయి. దీంతో వంకాయలపాడు, ఉప్పరపాలెం, లింగారావుపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట, బున్నినగర్, సొలస, కోట, కొత్తపాలెం, కొండవీడు, సంతపేట గ్రామాల్లో అంధకారం అలుముకుంది.

ఎస్సీ మహిళలకు ఉచితంగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ఎస్సీ మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఎస్సీ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఎన్‌ఏసీ శిక్షణా కేంద్రంలో ఈ తరగతులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ సామాజిక మహిళలు తమ ఆధార్, కుల ధ్రువీకరణ, విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ లింక్ మొబైల్ ఫోన్‌తో ఎన్‌ఏసీ కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9394102075, 9985496190 నెంబర్లులో సంప్రదించాలని తెలిపారు.

రెంటాలలో 22 గేదెల అపహరణ

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామంలో 22 గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున బుధవారం తెలిపారు. గ్రామంలోని కటికల సంసోన్, పేరుపోగు ఇస్రాయేల్, కటికల యేసయ్య, చిలక మరియమ్మలకు చెందిన 22 గేదెలు ఏప్రిల్ 26 వ తేదీన మేత కోసం పొలంవెళ్లి సాయంత్రానికి ఇంటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కల గ్రామాలలో గాలించినా కనిపించపోవడంతో ఎవరైనా దొంగిలించి ఉంటారని నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన గేదెల విలువ సుమారు రూ. 3.90 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు..

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్దనున్న అతి పురాతన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకం చేపడుతున్నామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించి కమిషనర్ దేవదాయశాఖ గొల్లపూడి విజయవాడ వారు నోటిఫికేషన్ జారీచేశారన్నారు. పూర్తిచేసిన దరఖాస్తును ఈ నెల 26 తేదీలోపు పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి నరసరావుపేట వారికి నేరుగా అందజేయాలన్నారు. దరఖాస్తుల కోసం దేవదాయ శాఖ సత్తెనపల్లి ఇన్స్‌పెక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ నేతల దాడి



వెల్దుర్తి: బోదిలవీడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అత్తులూరి హనుమంతరావుపై అదే గ్రామానికి చెందిన పాపయ్య, రాజేష్‌లు దాడి చేసి గాయపరిచారు. హనుమంతరావు పొలానికి వెళ్లి తిరిగి వచ్చిన సందర్భంలో బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ కార్యకర్తలు ఆయనపై రాళ్లు, కర్రలతో దాడి చేయటంతో గాయాలపాలయ్యాడు. బంధువులు హనుమంతరావును మాచర్ల వైద్యశాలకు తరలించారు. అనంతరం నర్సరావుపేట తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్షేత్ర సహాయకుల తొలగింపు

నరసరావుపేట: వివిధ మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న తొమ్మిదిమంది క్షేత్ర సహాయకులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరక్టర్ సిద్దలింగమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పత్రికలకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వర్క్‌సైట్‌లో ఒక వర్క్ ఐడీకి సంబంధించిన ఒకటే ఫొటోను వివిధ వర్క్ ఐడీలకు పంపినట్లుగా రుజువైందన్నారు. మాదుగుల పంచాయతీలోని ఎల్.ఆలేఖ, బెల్లంకొండ: కె.వెంకటేష్, కొప్పునూరు: కె.మరియదాసు, ఇర్లపాడు: బి.వీరాంజనేయులు, శావల్యాపురం: సీహెచ్.బాలకృష్ణ, వెల్లటూరు: ఏ.ప్రియాంక, రేమిడిచర్ల: టి.మనెయ్య, పిట్టంబండ: వై.మమత, దొండపాడు పంచాయతీలోని ఎం.అనూషలను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ నోటీసు జారీ చేశారు.

అసంఘటిత రంగ కార్మికులకు ఉచిత న్యాయ సహాయం


మాట్లాడుతున్న జడ్జి నరేందర్‌రెడ్డి

యడ్లపాడు: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేందర్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాలను పురస్కరించుకొని, మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్‌ఎస్‌ఎల్ నూలుమిల్లులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో కార్మికులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్మిక చట్టాలు, కనీస వేతనాల హక్కులు, బాల కార్మికుల నిషేధ చట్టం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందజేశారు. న్యాయ సహాయం అవసరమైన సందర్భాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలని కార్మికులను ప్రోత్సహించారు. చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్‌ఎస్ ప్రసాద్, న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, బి.రాజేష్, పారాలీగల్ వలంటీర్ జాషువా, ఏఎస్‌ఐ వెంగయ్య, నూలుమిల్లు జీఎం నరసింహం తదితరులు పాల్గొన్నారు.

కొండమోడు-పేరేచర్ల రహదారికి భూమి పూజ


రెడ్డిగూడెం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం వద్ద కొండమోడు - పేరేచర్ల వరకు నేషనల్ హైవే ఏర్పాటుకు మండలంలోని రెడ్డిగూడెం వద్ద ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు భూమి పూజచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కొండమోడు నుంచి పేరేచర్ల వరకు సూమారు 50 కి.మీ నేషనల్ హైవే రహదారి నిర్మాణం జరుగుతుందని తెలిపారు. దీని కోసం రూ.881 కోట్లు మంజూరయినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రెండేళ్లలో రహదారి నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. అనుపాలెం, రాజుపాలెం, తదితర గ్రామాల వద్ద ప్రమాదాలు జరురగకుండా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తారని తెలిపారు. సత్తెనపల్లి పట్టణం, మేడికొండూరు గ్రామాలకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేషనల్ హైవేస్ ఈఈ సంజీవరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా చర్లపల్లి-బెరహంపూర్‌కు ప్రత్యేక రైలును ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-బెరహంపూర్ రైలు (07027) ప్రతి శుక్రవారం వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 9,16,23,20 తేదీలు, జూన్ 6,13,20,27వ తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. బెరహంపూర్-చర్లపల్లి రైలు (07028) ఈ నెల 10,17,24,31 తేదీలు, జూన్ 7,14,21,28 తేదీల్లో నడుస్తుందని తెలియజేశారు. ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

నివాళులర్పించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు


అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: విప్లవ వీరుడు, మన్యం ప్రజల ఆరాధ్య దైవం అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతిఒక్కరూ గుర్తుచేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్‌వారి దోపిడీని ఎదుర్కోవడానికి మన్యం ప్రజలకు, పేదవారికి అండగా నిలిచిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఎస్బీ సీఐ బండారు సురేష్‌బాబు, ఆర్‌ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో...

కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ ఏకా మురళి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఓ, అధికారులు పాల్గొన్నారు.

ముడిఖనిజం అక్రమ రవాణాపై ఫిర్యాదు

తనిఖీలు నిర్వహించిన అటవీశాఖ అధికారులు


మాలపాడు గ్రామసమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ముడి ఖనిజం

బొల్లాపల్లి: బండ్లమోటు మైనింగ్ నుంచి లెడ్, డోలమైట్ ముడి ఖనిజాలు అక్రమంగా తరలించి సమీపంలోని మాలపాడు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచారని స్థానికంగా వచ్చిన ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ వినుకొండ రేంజ్ అధికారి సి.మాధవరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం రాత్రి 7 గంటల నుంచి 12 గంటల వరకు తనిఖీ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బండ్లమోటుకు చెందిన హిందుస్తాన్ లెడ్ జింక్ మైనింగ్ నుంచి ముడిఖనిజాలు ద్విచక్రవాహనంపై తరలించి సమీపంలోని మాలపాడు గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచారని స్థానికులు కొందరు ఫిర్యాదు చేశారు. 2002 అక్టోబరులో బండ్లమోటు మైనింగ్ మూతపడింది. అప్పట్లో వేల టన్నుల లెడ్, డోలమైట్, ముడిఖనిజాల నిల్వలు బయట వదిలేశారు. ఇటీవల కాలంలో కొందరు ద్విచక్రవాహనాలపై అక్రమ మార్గంలో వీటిని తరలించి సమీపంలోని పొలంలో నిల్వ ఉంచారని స్థానికులు కొందరు మొబైల్ కెమెరాలో ఆ దృశ్యాలు తీసి జిల్లా ఫారెస్ట్ అధికారి, వినుకొండ రేంజ్ అధికారికి వాటిని పంపారు. ఈ మేరకు వినుకొండ రేంజ్ అధికారి గ్రామానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ విషయంపై వినుకొండ రేంజ్ అధికారిని వివరణ అడగ్గా స్థానికులు ఫొటోలు తీసి పంపారని, వారి ఫిర్యాదు మేరకు తనిఖీ నిర్వహించామన్నారు. తనిఖీలో ఆ ప్రదేశంలో ఎటువంటి ముడి ఖనిజ నిల్వలు వెలుగు చూడలేదని రేంజ్ అధికారి తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టామని ఒకటి రెండు రోజుల్లో దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని రేంజ్ అధికారి తెలిపారు. అయితే ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదని, తూతూ మంత్రంగా, నామ మాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులెత్తేశారని స్థానికులు చెబుతున్నారు.

తొండపిలో పోలీసుల కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు, పోలీసు సిబ్బంది

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో జరిగిన చిన్నపాటి ఘర్షణ, ఫ్యాక్షన్ నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలలో భాగంగా గృహాలను తనిఖీ చేయటం జరిగిందన్నారు. ప్రతి ఇంటిని, దుకాణాలను సోదాలు చేశారు. పలు ఇళ్లలో మారణాయుధాలు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లుగా తమ దృష్టి వచ్చిందని, అసాంఘిక నేరాలకు పాల్పడే వారిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని 60 మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఎటువంటి పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు, ముప్పాళ్ల ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అది ఆత్మహత్య కాదు..!

- నా కుమారుడి మృతిపై సమగ్ర దర్యాప్తు జరపండి
- క్వారీకుంటలో పడి మృతి చెందిన తేజ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు


మృతుడు తేజ్ (ఫైల్)

యడ్లపాడు: మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్న ప్రేమజంట ఆత్మహత్యాయత్నం ఘటనపై బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ ఘటనలో దాసరిపాలెం గ్రామానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి కొర్నెపాటి తేజ్(19) కొండగట్టుపై నుంచి క్వారీనీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే తన కుమారుడిది ఆత్మహత్య కాదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తేజ్ తండ్రి కొర్నెపాటి మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మే 5వ తేదీ రాత్రి తేజ్ తన స్నేహితుడు కోటిరెడ్డితో కలిసి చౌడవరం శివారులోని ప్రైవేటు వసతి గృహంలో ఉన్న మిత్రుడి గదికి చదువుకోడానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం తేజ్ స్నేహితులు తేజ్ తండ్రి మహేష్ వద్దకు వచ్చి తేజ్, కీర్తనలు ప్రేమలో ఉన్నారని, పెద్దల నిరాకరణతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. వారిద్దరూ చౌడవరం బాలకుటీర్ పాఠశాల వెనుక ఉన్న క్వారీ నీటి గుంటలో దూకారని చెప్పిన స్నేహితులు, కీర్తనను అప్పటికప్పుడు కాపాడినట్లు మహేష్‌కు చెప్పారు. అయితే తేజ్ కనిపించకపోవడంతో తండ్రి సంఘటనా స్థలానికి చేరుకుని కుంట వద్ద తేజ్ చెప్పులు గుర్తించి, స్థానికుల సహాయంతో గుంటలో నీటిని తోడించగా తేజ్ మృతదేహం వెలికి తీశారు. ఈ సంఘటనపై తేజ్ తండ్రి, తన కుమారుడి మృతిపై కీర్తనతో పాటు స్నేహితులు కోటిరెడ్డి, చందులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యడ్లపాడు ఎస్‌ఐ టి.శివరామకృష్ణ ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి, పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తేజ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబానికి అప్పగించారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో పదికి పైగా కేసులు
- అతనికి సహకరించిన మరో ముగ్గురు అరెస్టు
- బంగారు ఆభరణాలు స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.వి.చరణ్, పక్కన ఎస్‌ఐలు వంశీకృష్ణ, అరుణ

నరసరావుపేటటౌన్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 70 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు. బుధవారం స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన వెల్లలచెరువు వెంకట శివరామకృష్ణ బల్లికురవ మండలం, గుంటుపల్లి గ్రామంలో వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో దైవదర్శనానికి వెళ్లాడు. తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువాలోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఇంటివద్ద లభ్యమైన సీసీ పుటేజ్ ఆధారంగా తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం, బందారం గ్రామానికి చెందిన దుద్దేలింగంగా గుర్తించామన్నారు. నిందితుడి కోసం గాలిస్తుండగా అతనితో పాటు మరో ముగ్గురు చోరీ సొత్తును పంచుకుని విక్రయించేందుకు వెళుతూ రైల్వే స్టేషన్ వద్ద పట్టుబడ్డారన్నారు. నలుగురి వద్ద నుంచి చోరీకు గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో 9 కేసులు నమోదు అవ్వగా, తెలంగాణ రాష్ట్రంలో కూడా పలు దొంగతనం కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు విచారణలో తేలింద న్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్‌ఐ వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, మురళీకృష్ణలను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఇది 137.8642 టీఎంసీలకు సమానం.